
జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి

కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కొత్తపేటలో అవసరమైన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని జోనల్ కమిషనర్ పంకజకు కార్పొరేటర్ పవన్‌కుమార్ విన్నవించారు. సోమవారం జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్‌ను కలిసి డివిజన్‌లో సమస్యలను విన్నవించారు. సత్యానగర్ తదితర కాలనీల్లో నూతన డ్రైనేజీ పనుల్లో భాగంగా తవ్వేసిన సీసీ రోడ్లకు మరమ్మతులు చేపట్టాలన్నారు. బాక్స్ డ్రైన్ పనులు ఆగడంతో వాహన ప్రయాణం ప్రమాదకరంగా మారిందని, త్వరగా పనులు పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీల్లో వీధికుక్కల బెడదను పరిష్కరించాలని విన్నవించారు. కాలనీల్లో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులను ఆయన వివరించారు.

పత్తిలో మేలైన పద్ధతులపై రైతులకు శిక్షణ

హయత్‌నగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లోని కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ, రంగారెడ్డి జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం అధిక సాంద్రత, పత్తిలో మేలైన పద్ధతులపై రైతులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి క్రీడా డైరెక్టర్ వీకే సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సాధారణ పద్ధతులలో పత్తి విత్తుకోవడం, అధిక సాంద్రతలో పత్తి విత్తుకోవడంలో గల తేడాలను పలువురు సైంటిస్టులు వివరించారు. ఈ కార్యక్రమంలో కేవీకే హెడ్ రమణ, సైంటిస్టులు విజయకుమార్, శ్రీనివాస్, సుధీర్, వాణిశ్రీతో పాటు పలువురు పాల్గొన్నారు.


నూతన కార్యవర్గం అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, ఇతర ప్రతినిధులు

శ్రీ సాయినగర్ కాలనీ సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక

సరూర్‌నగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ 41వ డివిజన్ శ్రీసాయినగర్ కాలనీ సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాలనీకి చెందిన 41వ డివిజన్ కార్పొరేటర్ బొక్క రాజేందర్‌రెడ్డి ఎన్నికవగా, ఉపాధ్యక్షుడిగా జి.శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శిగా జెనిగె జంగయ్యయాదవ్, సంయుక్త కార్యదర్శిగా డి.శ్రీనివాస్‌రావు, కోశాధికారిగా వి.విశ్వేశ్వరరావు, సలహాదారులుగా సీవీ రామకృష్ణ, జేవీఎస్ఆర్‌కే ప్రసాద్, సీహెచ్ వెంకటేశ్వర్లు, జి.పవన్‌కుమార్, ఆడిటర్‌గా ఎస్.సుబ్బారావు, కార్యవర్గ సభ్యులుగా కృష్ణమూర్తి, చంద్రమౌళి, నర్సింహదీక్షితులు, స్వామి, సంతోష్‌బాబు, సురేశ్, శ్రీను, రంజిత్‌కుమార్ అనిల్ గౌడ్ ఎన్నికయ్యారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతులు

మధ్యాహ్నం 2 నుంచి 5 వరకు పవర్ కట్

హయత్‌నగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): 31వ తేది బుధవారం ఇంజాపూర్‌లోని 33/11 సబ్‌స్టేషన్‌లో మరమత్తుల కారణంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ ప్రసారంలో అంతరాయం కలుగుతుందని సబ్‌స్టేషన్ ఏఈ రాములు తెలిపారు. ఇంజాపూర్‌లోని పలు కాలనీలు, స్నేహపురి కాలనీ, సాయి దయా కాలనీ, మైత్రిమెడోస్, తుల్జాభవానీ కాలనీ, ప్రకాష్‌నగర్, దుర్గానగర్, సుందరయ్యనగర్, బాలాజీనగర్, శ్రీరంగపురం, సాయిప్రియ నగర్, సాయినాథ్‌కాలనీలో కరెంటు ఉండదని తెలిపారు. విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలన్నారు.

కొత్తపేట : నేడు (మంగళవారం) మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు కొత్తపేట డివిజన్ కాలనీల్లో చెట్ల కొమ్మలతొలగింపు, అవసరమైన ఇతర విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆర్‌కె.పురం విద్యుత్ విభాగం ఆపరేషన్స్ అధికారులు తెలిపారు.

సైదాబాద్ : టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఆస్మాన్‌ఘడ్ డివిజన్ పరిధిలోని మరమ్మతు పనుల కారణంగా మంగళవారం 11కేవీ జాప్రీ నగర్ ఫీడర్ పరిధిలోని పరిసర ప్రాంతాలలో...

సంతోష్‌నగర్ : టీఎస్ఎస్‌పీడీసీఎల్ సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని 11కేవీ ఆనంద్‌నగర్, రాఘవేంద్రనగర్‌కాలనీ, మదర్‌డైరీ, లెక్చరర్స్‌కాలనీ, ఆల్ ఇండియా రేడియో, హయత్‌నగర్, కల్వంచ, విద్యుత్‌నగర్, కొత్తపేట, మోహన్‌నగర్, లక్ష్మీనగర్, న్యూ మారుతీనగర్, ఆర్‌కేపురం, విజయపురి ఫీడర్ల పరిధిలోని ప్రాంతాలలో చెట్లు కొట్టివేత, నిర్వహణ పనుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని డీఈ తెలిపారు.

వనస్థలిపురం : మరమ్మతుల కారణంగా బైరమాల్‌గూడ సబ్‌స్టేషన్ పరిధిలో నేడు (మంగళవారం) పలు ప్రాంత్రాల్లో విద్యుత్ సరఫరాలో ఉదయం 10గంటల నుంచి 1గంట వరకు అంతరాయం ఉంటుందని వనస్థలిపురం ఏడీఈ రాంచందర్ తెలిపారు.

అభివృద్ధి చూసి ప్రజలు పట్టం కట్టారు

- సబితా ఇంద్రారెడ్డి

ఎల్బీనగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి చూసి ప్రజలు తనకు ఓట్లు వేసి మరోసారి గెలిపించారని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఎమ్మెల్యేగా విజయం సాధించిన తర్వాత ఆర్‌కేపురం ఎన్‌టీఆర్‌నగర్‌లోని ఖిల్లా మైసమ్మ దేవాలన్ని సబితా ఇంద్రారెడ్డి సందర్శించి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, మహిళా విభాగం అధ్యక్షురాలు పటేల్ సునితారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, చామల శైలజారెడ్డి, శ్రీనివాస్ ముదిరాజ్, లింగస్వామిగౌడ్, పాల్గొన్నారు.

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని శ్రీ హనుమాన్ దేవస్థానంలో నిత్య పూజలందుకుంటున్న శ్రీ ధ్యానాంజనేయస్వామిని సోమవారం మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితఇంద్రారెడ్డి దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు అంజిరెడ్డి, బీసుకుంట్ల సతీష్‌గౌడ్, కిరణ్‌కుమార్‌గుప్తా, శైలజ, మీర్‌పేట కార్పొరేటర్లు, నాయకులు అనిల్‌యాదవ్, బొక్క రాజేందర్‌రెడ్డి, సిద్దాల లావణ్య, బైగళ్ల బాలమణి, శేఖర్‌రెడ్డి, కామేష్‌రెడ్డి పాల్గొన్నారు.

కోదండరాంకు అభినందనలు

హయత్‌నగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎంఎల్‌సీ కోదండరాంను సోమవారం హయత్‌నగర్ మండలానికి చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుల జేఏసీ నాయకులు, రంగారెడ్డి జిల్లా ఉద్యమ కారుల ఫోరం కన్వీనర్ కొంతం యాదిరెడ్డి, పూర్వ హయత్‌నగర్ మండల జేఏసీ చైర్మన్ కందాళ భల్‌దేవ్‌రెడ్డిలు కలిసి అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కోదండరాంకు గవర్నర్ కోటాలో ఎంఎల్‌సీ ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కాళోజీ నారాయణరావు, ఆచార్య జయశంకర్ ఆశయాలను ముందుకు తీసుకువెళుతున్న కోదండరాంకు తగిన గౌరవం దక్కిందన్నారు. ఉద్యోగ, విద్యార్థి, ప్రజా సంఘాలను ఐక్యం చేసి ఉద్యమాన్ని ముందుకు నడిపిన కోదండరాంకు మరింత గౌరవం దక్కాలని కోరారు.


ఎంఎల్సీ కోదండరాంను కలిసిన మలి దశ ఉద్యమకారులు జేఏసీ నాయకులు యాదిరెడ్డి, భల్‌దేవ్‌రెడ్డి

ఆగిన బాక్స్ డ్రెయిన్ పనులు

- కానరాని ప్రమాద సూచికలు
- పనుల పునరుద్ధరణలో కాంట్రాక్టర్ అలసత్వం

కొత్తపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఆ దారిలో బాక్స్ డ్రెయిన్ పనులు ఆగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, వాహన ప్రయాణం ప్రమాదకరంగా మారింది. నాలుగు నెలల క్రితం కొత్తపేట గాయత్రిపురం, నాగేశ్వర్ కాలనీ, ఎస్ఆర్ఎల్ కాలనీ దారిలో ప్రారంభమైన బాక్స్ డ్రెయిన్ పనులు పలు ఆటంకాల మధ్య కొనసాగినా ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల ప్రకటనకు ముందు అకస్మాత్తుగా ఆగిపోయాయి. దీంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. కొత్తపేట డివిజన్ పరిధిలోని కొత్తపేట - నాగోల్ చౌరస్తా ప్రధాన రహదారి నుంచి గాయత్రిపురం, నాగేశ్వర్ కాలనీ, ఎస్ఆర్ఎల్ కాలనీ దారిలో ఆగిన బాక్స్ డ్రెయిన్ నిర్మాణ పనులతో తలెత్తుతున్న ఇబ్బందులపై ఆంధ్రజ్యోతి కథనం.

పలు కారణాలతో ఆగిన పనులు.. కానరాని ప్రమాద సూచికలు

గాయత్రిపురం ప్రాంతం నుంచి దారిలో చేపట్టిన బాక్స్ డ్రెయిన్ నిర్మాణ పనులు ఆగిపోయాయి. తొలుత ఓ చోట భారీ చెట్టు రోడ్డు తవ్వకాలకు అడ్డు రావడంతో పనుల ఆపేశారు. ఆ చెట్టును తొలగించేందుకు కాలనీల వారే అంగీకరంచలేదని తెలిసింది. తర్వాత జీహెచ్ఎంసీ అధికారులు అటవీ శాఖ అధికారులను సంప్రదించారు. చెట్టును తొలగించాక కూడా పనులకు అకాల వర్షాలతో ఆటంకాలు ఎదురయ్యాయి. పనులు నిలిచాక మట్టికుప్పలు, గుంటలు ఉన్న ప్రాంతాల్లో ప్రమాద సూచికలు ఏర్పాటు చేయలేదు.

పనుల పునరుద్ధరణలో కాంట్రాక్టర్ అలసత్వం

గాయత్రీపురం మీదుగా ఎస్ఆర్ఎల్ కాలనీ, సత్యానగర్, మారుతీనగర్ తదితర కాలనీలకు వెళ్లే వాహనదారులు ప్రస్తుతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాంట్రాక్టర్ అలసత్వంతో బాక్స్ డ్రెయిన్ పనుల పునరుద్ధరణలో జాప్యం జరుగుతోందని కాలనీ ప్రజలు ఆరోపిస్తున్నారు. పనుల్లో భాగంగా రోడ్డు తవ్వేయడంతో ఏర్పడిన గుంటల్లో వరద నీరు చేరినా తొలగించడంలో సత్వర చర్యలు చేపట్టలేదని అంటున్నారు.


ఆగిన బాక్స్ డ్రెయిన్ పనులతో ప్రమాదకరంగా గాయత్రీపురం గణపతి ఆలయం వద్ద రోడ్డు

బాక్స్ డ్రెయిన్ పనులు సత్వరమే పునరుద్ధరించండి



బాక్స్ డ్రెయిన్ పనులు ఆగిన ప్రతీసారి అధికారులను అప్రమత్తం చేశాను. ప్రస్తుతం పనులను పునరుద్ధరించాలని, పరిసర కాలనీల ప్రజలకు ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించాను. పనులు సత్వరమే చేపట్టేలా సంబంధిత అధికారులను సంప్రదిస్తాం. కాలనీల ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

- నాయికోటి పవన్‌కుమార్, కార్పొరేటర్, కొత్తపేట

వాహన ప్రయాణం ప్రమాదకరంగా



బాక్స్ డ్రెయిన్ పనులు ఆగిపోవడంతో కాలనీల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనులు నిలిపేసిన చోట గుంతలు చాలా ప్రమాదకరంగా మారాయి. బారికేడు లేదా ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలి. వాహనాల రాకపోకలకూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పనులు వెంటనే పునరుద్ధరించాలి

- సత్యనారాయణ, అధ్యక్షులు, ఎస్ఆర్ఎల్ కాలనీ


నాగేశ్వర్ కాలనీ వద్ద నిలిచిన బాక్స్ డ్రెయిన్ పనులు


ఎండిన కొమ్మలతో కప్పేసిన మ్యాన్‌హోల్

త్వరలో పనులు పునరుద్ధరిస్తాం

కొత్తపేట డివిజన్ పరిధిలో ఆగిన బాక్స్ డ్రెయిన్ పనులు త్వరలో పునరుద్ధరిస్తాం. కాలనీల ప్రజలకు ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. పనులు తిరిగి త్వరగా కొనసాగించాలని కాంట్రాక్టర్‌ను సంప్రదిస్తున్నాం. అకాల వర్షాలతో వరద నీరు చేరడం తదితర కారణాలతో పనులు కొనసాగించడంలో జాప్యం చోటుచేసుకుంది.

- మాత్యనాయక్, ఏఈ, జీహెచ్ఎంసీ.

చెరువులోకి మురికి నీరు చేరకుండా చర్యలు

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

చంపాపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): బైరామల్‌గూడ చెరువులోకి మురికి నీరు చేరకుండా తగిన చర్యలు తీసుకోనున్నట్లు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ బైరామల్‌గూడలోని చెరువును సోమవారం ఆయా శాఖల అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల కిందట చెరువులోకి మురికి నీరు చేరకుండా చెరువు ఎగువ ప్రాంతం నుంచి చెరువు పక్క నుంచి బైరామల్‌గూడ మీదుగా సరూర్‌నగర్ చెరువు వరకు నాలుగు ఫీట్ల యూజీడీ పైపులైన్ వేయించినట్లు తెలిపారు.

చెరువు వద్ద చిన్న జంక్షన్ నిర్మించినట్లు, జంక్షన్‌లో పేరుకుపోయిన చెత్త, చెదారంను శుభ్రం చేయకపోవడంతో నీరంతా తిరిగి చెరువులోకి వెళుతుందన్నారు. లైన్ ఫ్లో సరిగా వెళ్లక పోవడంతో యూజీడీ నీరంతా చెరువులోకి ప్రవేశిస్తుందన్నారు. చెరువు వద్ద ఏర్పాటు చేసిన జంక్షన్ వద్ద ప్రతి రోజు చెత్తను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. చెరువు సుందరీకరణ, మురికినీరు చేరకుండా చర్యలు తీసుకోనున్నట్లు ఎమ్మెల్యే పరిసర కాలనీల ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ దశరథ, ఈఈ కోటేశ్వర్‌రావు, ఇరిగేషన్ డీఈ పవన్, జీహెచ్ఎంసీ ఏఈ సురేష్, శ్రీహనుమాన్ దేవస్థానం చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ముడుపు రాజ్‌కుమార్‌రెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సుంకోజు కృష్ణమాచారి, ఆలయ డైరెక్టర్ సతీష్‌గౌడ్, నాయకులు రవి ముదిరాజ్, ఉమామహేశ్వర్, నిష్కాంత్‌రెడ్డి, బొంబాయి, గ్యారగోని ప్రవీణ్‌గౌడ్, మల్లేష్‌గౌడ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.


బైరామల్‌గూడ చెరువు వద్ద ఏర్పాటు చేసిన జంక్షన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఓయూలో లైట్స్ అండ్ సౌండ్ లేజర్ షో

ప్రారంభించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

తార్నాక, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మకమైన ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ భవనానికి రూ.11.8 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన లైట్స్ అండ్ సౌండ్ లేజర్ షో కార్యక్రమాన్ని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. లేజర్ వెలుగుల ప్రొజెక్షన్ ద్వారా వర్సిటీ చరిత్రను, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఓయూ పాత్రను, భారత స్వాతంత్ర్య సంగ్రామాన్ని సజీవంగా వివరించేవిధంగా రూపొందించారు. కాగా అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో 16 మిలియన్లకు పైగా రంగుల కలయికతో డీఎంఎక్స్ ప్రొటోకాల్‌ని ఉపయోగించి 600 కంటే ఎక్కువ లైట్లను పొందుపరిచారు. ఈ సందర్భంగా మంత్రి జి.కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. దేశంలోని వివిధ ప్రాంతాల్లో స్థానిక సంస్కృతి, సంప్రదాయాలను నేటి తరానికి తెలియజేయాలనే ఉద్దేశంతో ఇటువంటి ప్రాజెక్టులను చేపట్టడం జరిగిందన్నారు. అందులో భాగంగానే తెలంగాణ ఉద్యమానికి కేంద్ర బిందువైన ఓయూ ఆర్ట్స్ కాలేజీ బిల్డింగ్‌కు అధునాతనమైన టెక్నాలజీతో లైట్ అండ్ సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేశామన్నారు. ఓయూ ఆర్ట్స్ కాలేజీకి ఏర్పాటు చేసిన లైట్ అండ్ సౌండ్ సిస్టమ్ ప్రారంభోత్సవం సాంస్కృతిక గొప్పతనాన్ని, కళాత్మకతకు ప్రతీకగా నిలిచిందని అభిప్రాయపడ్డారు. దేశానికి ఎంతోమంది మేధావులు, ప్రముఖులను సమాజానికి అందించిన గొప్ప చరిత్ర ఉస్మానియా యూనివర్సిటీకి ఉందని, ఇంతటి గొప్ప చరిత్ర ఉన్న ఓయూ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఓయూ వీసీ డా.రవీందర్ మాట్లాడుతూ.. ఉస్మానియా యూనివర్సిటీలో సాంస్కృతిక మౌలిక సదుపాయాలను కల్పించడానికి సహకరించిన కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్ట్స్ కాలేజీకి ఏర్పాటు చేసిన లేజర్ వెలుగులు ఓయూకు కొత్త కళను తీసుకొచ్చాయని అభిప్రాయపడ్డారు. మాజీ వీసీ ప్రొఫెసర్ డీసీ రెడ్డి, తిరుపతి రావు, సినీనటుడు సాయికుమార్, జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్ రెడ్డి, ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.లక్ష్మీనారాయణ, ఓఎస్‌డీ రెడ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తదితరులు

రూ.4కోట్లతో వీధి వ్యాపారులకు కేంద్రాలు

- ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్. జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేటలోని వీధి వ్యాపారులకు వ్యాపార కేంద్రాల ఏర్పాటు చేసేందుకు జీహెచ్ఎంసీతో కలిసి ప్రణాళికను రూపొందించినట్లు ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. సోమవారం ఆయన మలక్‌పేట వాహేద్‌నగర్‌లో మొదటి విడతగా రూ.4కోట్ల వ్యయంతో వీధి వ్యాపారులకు ఉపాధి కల్పించేందుకు వ్యాపార కేంద్రాల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధి వ్యాపారులు ఎక్కడపడితే అక్కడ తోపుడు బండ్లను, డబ్బాలను ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు సాగిస్తూ వాహనాల రాకపోకలకు, పాదచారులకు ఇబ్బంది కలిగిస్తున్నారన్నారు. ఇలాంటి అనేక సమస్యల పరిష్కారం కోసం జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగంతో కలిసి వీధి వ్యాపారులకు ఫుట్‌పాత్‌లపై వ్యాపార కేంద్రాలను ఏర్పాటు చేసి, వాటి ద్వారా ఆయా కుటుంబాలకు ఉపాధి కల్పించాలని నిర్ణయించామన్నారు. వాహేద్‌నగర్‌లో సుమారు రూ.4కోట్ల వ్యయంతో 67మంది వీధి వ్యాపారులకు వ్యాపార కేంద్రాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టినట్లు ఆయన వివరించారు.

రెండో విడతలో మలక్‌పేట ముంతాజ్ కళాశాల లేన్‌లో కూడా వీధి వ్యాపారులకు వ్యాపార కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. వాహేద్‌నగర్‌లో 67మంది వీధి వ్యాపారులకు వ్యాపార కేంద్రాల ఏర్పాటుతో దాదాపు 6వందల కుటుంబాలు ఉపాధి పొందుతాయన్నారు. మరో రెండు రోజుల్లో వీటి పనులు ప్రారంభమవుతాయన్నారు. టెండర్ల ద్వారా వీటి కేటాయింపు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 డిప్యూటీ ఈఈ ప్రదీప్‌కుమార్, ఏఈ రఘువీర్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఎంఐఎం నాయకులు సైఫుద్దీన్ షఫీతోపాటు పలువురు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బలిజగూడ, బాచారం, బండరావిరాల, చిన్నరావిరాల గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. దశలవారీగా అన్ని మండలాల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలు చేసి తీరుతాం అన్నారు. ఫిబ్రవరి మొదటి వారంలో మరో రెండు గ్యారెంటీలను అమలు చేయనున్నట్లు తెలిపారు. మైనింగ్ జోన్ బాధిత రైతులందరికీ న్యాయం చేస్తామన్నారు. మైనింగ్ జోన్‌లో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ బింగి దేవదాసుగౌడ్, వైస్ ఎంపీపీ కొలన్ శ్రీధర్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్‌దత్తు, ఎంపీడీవో మమతాబాయ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి జైలు, జరిమానా

రంగారెడ్డి కోర్టులు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అత్యాచారం కేసులో నిందితునికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, జరిమాన, నష్టపరిహారం చెల్లించాలని పోక్సో కోర్టు న్యాయమూర్తి తీర్పు చెప్పారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సునీత బర్ల కథకం ప్రకారం.. పదవ తరగతి చదువుతున్న బాలికను స్థానికంగా బార్బర్ షాపు నిర్వహిస్తున్న మహేష్ అనే వ్యక్తి వెంటపడేవాడు. ఆ అమ్మాయిని పరిచయం చేసుకుని మాయమాటలు చెప్పి రెండుసార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. విషయం తెలిసిన బాధితురాలి తండ్రి 2016లో వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి సాక్ష్యాధారాలతో కోర్టులో ఛార్జ్‌షీటు దాఖలు చేశారు. సాక్ష్యాలను పరిశీలించి విచారించిన న్యాయమూర్తి పద్మావతి నిందితునికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.25వేల జరిమాన విధించి రూ.5 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని తీర్పు చెప్పారు.

ప్రజావాణికి కానరాని స్పందన

ఎల్బీనగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజావాణికి జీహెచ్ఎంసీలో స్పందన అంతంతమాత్రంగానే కనిపిస్తున్నది. సోమవారం జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో కేవలం 6 ఫిర్యాదులు మాత్రమే వచ్చాయి. వాటిలో కాప్రా సర్కిల్‌కు సంబంధించిన ఒక ఫిర్యాదు, హయత్‌నగర్ సర్కిల్‌కు సంబంధించిన 3 ఫిర్యాదులు, ఎల్బీనగర్, సరూర్‌నగర్ సర్కిళ్లకు సంబంధించి ఒక్కో ఫిర్యాదు వచ్చినట్లు జోనల్ కమిషనర్ పంకజ తెలిపారు. టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించి 5, ఇంజనీరింగ్ సెక్షన్‌కు సంబంధించి ఒక ఫిర్యాదు వచ్చినట్లు ఆమె చెప్పారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సంబంధిత సెక్షన్లకు పంపి తగు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. ప్రజలు తమ సమస్యలను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ అశోక్‌రెడ్డి, సిటీప్లానర్ ప్రసాదరావు, ఏసీపీ రాజేందర్‌రెడ్డిలతో పాటు వివిధ సెక్షన్ల అధికారులు పాల్గొన్నారు.

చాదర్‌ఘాట్ : ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను పరిశీలించి సంబంధత అధికారులతో వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టి.వెంకన్న తెలిపారు.

'భవనానికి, భూమికి నష్టపరిహారం ఇవ్వండి'

హయత్‌నగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విజయవాడ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా హయత్‌నగర్‌లో నష్టపోతున్న భవన యజమానులు సోమవారం కేంద్ర పర్యాటక శాఖ మంతి జికిషన్‌రెడ్డిని కలిసి నష్టపోతున్న భూమి, భవననిర్మాణానికి నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. మార్కెట్ విలువపై మూడింతల నష్ట పరిహారం ఇప్పించాలని అడిగారు. జాతీయ రహదారి అధికారులు కేవలం భవన నిర్మాణానికే నష్ట పరిహారం ఇస్తామని అంటున్నారని బాధితులు మంత్రి దృష్టికి తీసుకు వెళ్లారు. స్థలానికి, అందులో ఉన్న భవనానికి నష్ట పరిహారం ఇవ్వాలని బాదితులు డిమాండ్ చేశారు. వెంటనే మంత్రి కిషన్ రెడ్డి సంభందిత అధికారికి ఫోన్ చేసి మాట్లాడారు. బాదితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్‌రెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కళ్లెం రవీందర్‌రెడ్డి, కొత్త రవీందర్ గౌడ్, బాదితులు నక్క వెంకటేశ్‌గౌడ్, సూర్యా శ్రీనివాస్‌రెడ్డి, బండారు శ్రీనివాస్, రాజుతో పాటు పలువురు పాల్గొన్నారు.

చైనా మాంజా తగిలి బాలుడికి గాయాలు

తల్లిదండ్రులకు ఎమ్మెల్యే పరామర్శ

మన్సురాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): చైనా మాంజా తగిలి గొంతుకు గాయాలపాలై ఆసుపత్రిలో చేరిన బాలుడు, వారి తల్లిదండ్రులను ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. మన్సూరాబాద్ వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన టి.శ్యాం, త్రివేణి దంపతులు తమ కుమారుడు అంజనీకుమార్ (20 నెలలు)తో కలిసి బైకుపై వెళ్తుండగా.. ఆదివారం సాయంత్రం మన్సూరాబాద్ పోచమ్మ దేవాలయం వద్ద చైనా మాంజా తగిలి తీవ్రంగా గాయపడిన నేపథ్యంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడి వద్దకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వెళ్లి పరామర్శించారు. బాలుడి తల్లిదండ్రులతో మాట్లాడిన ఆయన వివరాలు తెలుసుకున్నారు. చిన్నారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఎమ్మెల్యే సూచించారు. మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, టంగుటూరి నాగరాజు, విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

అదనపు కలెక్టర్‌కు బీఎస్పీ నేతల ఫిర్యాదు

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గౌరెల్లి గ్రామంలోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న వారిపై చట్టపరమైనా చర్యలు తీసుకోవాలని బీఎస్పీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అ్యక్షుడు గ్యార మల్లేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. గౌరెల్లిలోని సర్వే నంబర్ 195, 182, 206, 238లోని ప్రభుత్వ భూమిని అక్రమించిన కొందరు అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. బీఎస్పీ అసెంబ్లీ కార్యదర్శి యాంజాల్ ప్రహ్లాద్, మండల అధ్యక్షుడు చిత్రం కృష్ణ, ధన్‌రాజ్, చిరంజీవి, రాంబాబు పాల్గొన్నారు.

చికిత్స నిమిత్తం ఆస్పత్రికి .. మృతి

వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బాధితుల ఆందోళన

వనస్థలిపురం, జనవరి29 (ఆంధ్రజ్యోతి): చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేరి మృతి చెందిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ తంగడపల్లికి చెందిన సిలివేరు శేఖర్ (47) భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి తంగడిపల్లిలో నివాసం ఉంటున్నాడు. కాగా ముక్కు, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న శేఖర్ చికిత్స నిమిత్తం వనస్థలిపురం చింతలకుంటలోని ఓ ఆస్పత్రిలో ఈనెల 28న చేరారు. కాగా శేఖర్‌కు వైద్యులు సోమవారం ముక్కు ఆపరేషన్ చేశారు. బాధితుని ఆరోగ్యం ఇబ్బందికరంగా ఉండడంతో మలక్‌పేట్‌లోని యశోద ఆస్పత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించారు. అక్కడి వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు అంతకుముందు వైద్యం అందించిన ఆస్పత్రి నిర్వాహకుల నిర్లక్ష్యపు వైద్యంతోనే తమ శేఖర్ మృతి చెందాడని ఆరోపిస్తూ మృతదేహంతో సోమవారం రాత్రి వరకు హాస్పిటల్ ముందు ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులకు నచ్చచెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.